క్లుప్తంగా

హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి


మోహన్‌రామ్

రామసముద్రం: మండల పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఎ.మోహన్‌రామ్‌కు హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు జిల్లా ఎస్పీ నుంచి ఉత్తర్వులు అందాయి. మోహన్‌రామ్ 2003లో ఏపీఎస్పీలో పని చేసి 2009లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ఆయన చౌడేపల్లె, మదనపల్లె తాలూకా, పుంగనూరు , రామసముద్రంలో పని చేశారు. ఆయన పదోన్నతిపై ఎస్ఐ చంద్రశేఖర్‌తో పాటు సహ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

పీర్ల ఊరేగింపు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంట పంచాయతీలో పీర్ల పండుగ ఉత్సవాలు ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో శనివారం ఎగవ, దిగవ బండమీదపల్లి, బురదవారిపల్లి గ్రామాల్లో మంగళ వాయిద్యాల నడుమ భక్తి శ్రద్ధలతో పీర్ల ఊరేగింపు నిర్వహించారు. కుల, మతాలకు అతీతంగా ప్రజలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆదర్శ డిపోగా తీర్చిద్దాలి

మదనపల్లె సిటీ: మదనపల్లె ఆర్టీసీ డిపోను ఆదర్శ డిపోగా తీర్చిదిద్దాలని ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక డిపోలో గేట్ మీటింగ్ నిర్వహించారు. సిబ్బంది ఇదే స్ఫూర్తితో పని చేసి మంచి పేరు తీసుకురావాలని కోరారు. జూన్ నెలలో రీజియన్‌లో ఓఆర్‌లో మొదటి స్థానం రావడం సంతోషకరమన్నారు. కెంఎంపిఎల్‌లో రెండవ స్థానం వచ్చిందన్నారు. జూలైలో కూడా ఆదాయం పెంచాలన్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి పాల్గొన్నారు.

స్పర్శలేని మచ్చలపై అవగాహన

వాల్మీకిపురం: స్పర్శలేని మచ్చలపై అవగాహన కలిగి ఉండాలని మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీవిద్య అన్నారు. శనివారం చింతపర్తి ఇల్లు ఇల్లు తిరిగి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేలో ఆశవర్కర్లు అందరూ ఇల్లు ఇల్లు తిరిగి చర్మంపై స్పర్శలేని మచ్చలను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమం ఆగస్టు రెండవ తేదీ వరకు జరుగుతుందన్నారు. అనంతరం చింతపర్తి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుధాకర్, ఇందిరారాణి, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి

వాల్మీకిపురం: ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ అధ్యాపకులు డాక్టర్ నారాయణ స్వామి అన్నారు. శనివారం స్థానిక పివిసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో టీమ్ ఏ, టీమ్ బిగా ఏర్పాటు చేసి, విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో టీమ్ బి విద్యార్థులు విజేతలు గెలుపొందగా, టీమ్ ఏ విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచినట్లు ప్రిన్సిపల్ ఉమా అమరేశ్వరి తెలిపారు.

విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన

వాల్మీకిపురం: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా 6వ రోజు శనివారం స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు పర్యావరణంపై హెచ్ఎం శ్రీదేవి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతన్నారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పర్వీన్, సుధారాణి, శోభారాణి, నాగరత్న, పుష్పలత, ఫర్హత్, ఉమాదేవి, రేణుక, షంషాద్, వసుంధర, రాధ తదితరులు పాల్గొన్నారు.

టీచర్లను సర్దుబాటు చేయాలని వినతి


డీవైఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

మదనపల్లె సిటీ: విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని యూటీఎఫ్ నాయకులు శనివారం డీవైఈఓ పురుషోత్తంకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్‌నాయుడు, జిల్లా కార్యదర్శి పురం రమణ మాట్లాడుతూ వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 1050 మంది విద్యార్థులకు ఒకే తెలుగు, హిందీ ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. వాల్మీకినగర్ మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో 210 మంది విద్యార్థులకు కేవలం నలుగురు ఉపాధ్యాయులు పని చేస్తున్నారన్నారు. దీని వల్ల విద్యార్థులు నష్టపోవాల్సి వస్తోందన్నారు. మాయబజారుమున్సిపల్ పాఠశాల, అమ్మచెరువుమిట్ట, చంద్రకాలనీలోని మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు కొరత ఉన్నట్లు తెలిపారు. డీవైఈఓ మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు రవిప్రకాష్, సుధాకర్, సుబ్రమణ్యం, రవీంద్ర, పయని, మల్లేశ్వరబాబు,హరిక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రామమూర్తి..చైతన్య స్ఫూర్తి

- విస్తృతంగా సేవ, చైతన్య కార్యక్రమాలు
- విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యం
- ఉత్తమ ప్రతిభ పురస్కారానికి ఎంపిక


విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న రామమూర్తి (ఫైల్)

మదనపల్లె సిటీ: ఆయనొక పోలీస్. స్టేషన్‌లో డ్యూటీ చేయడమే కాదు.. డ్యూటీలో లేనప్పుడు చాలు ప్రభుత్వ పాఠశాలల్లో అయ్యవారు అవతారం ఎత్తుతారు. మిమిక్రీతో వ్యక్తిత్వ వికాసాన్ని కలగలిపి విద్యార్థులకు కొత్త టానిక్ అందించి..చప్పట్లు కొట్టించుకుంటారు. ఆయనే మదనపల్లె టు టౌన్ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ డీజీ రామమూర్తి. ఇప్పటి వరకు లక్షల మంది విద్యార్థులను చైతన్యపరిచిన ఆయనకు ఈ నెల 28న (ఆదివారం)మదనపల్లెకు చెందిన ప్రజా చైతన్య స్రవంతి సంస్థ ఆధ్వర్యంలో సామాజిక సేవలు అందిస్తున్నందుకు గుర్తింపుడి ఉత్తమ ప్రతిభా పురస్కారం అందజేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన గురించి ప్రత్యేక కథనం.

స్ఫూర్తి

చైతన్య పరిచే పోలీసు

చిత్తూరు జిల్లా వి.కోట మండలం జవునిపల్లివాసి రామమూర్తి. తండ్రి గోవిందరాజు రైతు. తల్లి సరోజమ్మ గృహిణి .పాఠశాల విద్య అదే మండలంలో పూర్తి చేసి పలమనేరులో ఇంటర్, డిగ్రీ కోర్సులు పూర్తి చేశారు. 1992లో పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. కాలేజీ రోజుల్లో మిమిక్రీ నేర్చుకున్న ఆయన మొదటగా 2006లో గురుకుల పాఠశాల విద్యార్థులతో ఒత్తిడి తగ్గించి వారిని పరీక్షలకు సన్నద్ధం చేయడం కోసం ప్రేరణా కార్యక్రమం నిర్వహించారు. సినీనటులతో రాజకీయ నాయకులను అనుకరించే మిమిక్రీ చేస్తూ అందరి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. అదే స్ఫూర్తితో ఇప్పటి వరకు వేలాది కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థుల బాంగారు బాట వేస్తున్నారు. మదనపల్లెలో గురుకుల విద్యాలయాలతో పాటు ప్రభుత్వ జెడ్పీ, బాలికల జూనియర్ కాలేజీ, ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీల్లో విద్యార్థులకు మోటివేషన్ తరగతులు చెప్పి విద్యార్థుల్లో మనో ధైర్యం నింపారు. బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు, నిరక్షరాస్యత, చెడు వ్యసనాలతో జరిగే దుష్పరిణామాలపై తరచూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు పోలీసు ఉన్నతాధికారుల సూచనల మేరకు హెల్మెట్ అవేర్‌నెస్, ట్రాఫిక్ అవేర్‌నెస్, సైబర్‌క్రైం, లోన్‌యాప్స్, ప్యామిలీ కౌన్సెలింగ్, ఫ్రెండ్లీ పోలీసు, యాంటి డ్రగ్స్‌లకు సంబంధించి కార్యక్రమాలను నిర్వహించి పోలీస ఉన్నతాధికారుల నుంచి అభినందలు పొందుతున్నారు. నెల్లూరుకు చెందిన కరిమొద్దల నరసింహారెడ్డి, ప్రముఖ సైకాలజిస్టు పట్టాభిరామ్ తనకు స్ఫూర్తి అంటున్నారు రామమూర్తి.

మరింత బాధ్యతను పెంచింది



ప్రజా చైతన్య స్రవంతి ప్రతిభా పురస్కారానికి తనను ఎంపిక చేయడంతో మరింత బాధ్యత పెంచింది. ఇదే స్ఫూర్తితో పాఠశాలలు, కాలేజీల్లో మోటివేషన్ తరగతులు నిర్వహిస్తా. విద్యార్థుల్లో చైతన్యం తీసుకువచ్చి వారిలో మార్పు తీసుకువస్తా. చిన్నప్పటి నుంచి మానసిక వికాసం, సేవా గుణం అలవర్చుకోవాలి.

-డీజీ రామమూర్తి, హెడ్‌కానిస్టేబుల్, మదనపల్లె

దేశ భద్రతలో సీఆర్‌పీఎఫ్ కీలక పాత్ర


సీఆర్పీఎఫ్ కేంద్రంలో మొక్కలు నాటుతున్న అధికారులు

కలికిరి: దేశ భద్రతలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఐఏటీ-3) కీలక పాత్ర పోషిస్తోందని సీఆర్‌పీఎఫ్ విశ్రాంత డిప్యూటి ఇన్స్‌పెక్టర్ జనరల్ అనుపమ్ శర్మ అన్నారు. సీఆర్‌పీఎఫ్ 86వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కలికిరి సమీపం పాళ్యెం వద్దనున్న కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. సీఆర్‌పీఎఫ్ అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 85 సంవత్సరాలుగా దేశ సేవలో సీఆర్‌పీఎఫ్ ప్రధాన పాత్ర పోషిస్తోందని, ప్రత్యేకించి విద్రోహ నిరోధక బాధ్యతలను నిర్వర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. సమస్యాత్మకమైన జమ్మూ కాశ్మీర్, ఎల్‌డబ్ల్యూఈ ప్రభావిత రాష్ట్రాలు, ఈశాన్య ప్రాంతాల్లో మూడు అత్యంత ప్రతిష్టాత్మకమైన, క్లిష్టమైన ప్రాంతాల్లో సీఆర్‌పీఎఫ్ బలగాలు మోహరించి వున్నట్లు వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ముందుటామని ఆయన అన్నారు. అనంతరం కేంద్రం ఆవరణలో జవాన్‌లతో కలిసి మొక్కలు నాటారు. సీఆర్‌పీఎఫ్ ఆవిర్భాదినోత్సవం సందర్భంగా సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో కమాండెంట్ నీరజ్‌కుమార్ పాండే, సెకండ్ ఇన్ కమాండ్ కేబీకేఎస్ చౌదరి, డిప్యూటీ కమాండెంట్ అమరనాథ్ యాదవ్ జవాన్‌లు, అధికారుల, జవాన్‌ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తాం

– సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్


కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

మదనపల్లె : మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేద్దామని సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ అన్నారు. శనివారం సబ్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన తర్వాత సిబ్బందితో తొలిసారిగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చేందుకు, ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి సమన్వయంతో పనిచేద్దామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకతతో పనిచేసి మెరుగైన పాలన అందిద్దామన్నారు. సిబ్బంది తమ సెక్షన్ పరిధిలో పెండింగ్ వర్క్స్ లేకుండా ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాంకు నివాళులు


అబ్దుల్‌కలాం విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

మదనపల్లె : మాజీ రాష్ట్రపతి, ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్.ఏపీజే.అబ్దుల్‌కలాం వర్ధంతి సందర్భంగా బీజేపీ నాయకులు నివాళులు అర్పించారు. శనివారం స్థానిక జెడ్పీహైస్కూల్‌లోని అబ్దుల్‌కలాం విగ్రహానికి బీజేపీ పట్టణ అధ్యక్షులు బర్నేపల్లె రవి కుమార్ ఆధ్వర్యంలో రాజంపేట బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు యల్లంపల్లె ప్రశాంత్, ఆకు లక్ష్మణమూర్తి పుష్పాంజలి ఘటించారు. దేశం కోసం జీవితాన్ని ధారపోసిన మహనీయుడు కలాం అని స్మరించుకున్నారు. ఒక శాస్త్రవేత్తగా, భారత రక్షణ పరిశోధనా రంగంలో, అంతరిక్ష పరిశోధనారంగంలో కలాం చేసిన కృషిని దేశం ఎప్పటికీ విస్మరించబోదని పేర్కొన్నారు. తన రచనలతోనూ యువతలో దేశసేవ పట్ల స్ఫూర్తి నింపిన మహనీయుడు కలాం అని గుర్తుచేశారు. కలలు కనండి, వాటిని సాకారం చేసుకోండి అంటూ యువతలో స్ఫూర్తిని నింపిన మిసైల్ మ్యాన్‌గా అబ్దుల్ కలాంను కీర్తించారు. డాక్టర్.అజ్మతుల్లాఖాన్, బీజేపీ నాయకులు పూలనాగరాజు, కోసూరిభవాని, సంతోష్, పిల్లస్వామినాయక్, రెడ్డి పాల్గొన్నారు.

కలాం జీవితం అందరికీ ఆదర్శం

బి.కొత్తకోట: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శమని ఎంఈఓ రెడ్డిశేఖర్ అన్నారు. శనివారం కలాం వర్ధంతి సందర్భంగా మోడల్ స్కూల్, తూర్పు పాఠశాల, సుంకు జూనియర్ కళాశాలలో కార్యక్రమాలు నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రెడ్డిశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రపతి, శాస్త్రవేత్త, ఉపాధ్యాయునిగా దేశానికి ఆయన చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. మిసైల్ మ్యాన్ గా దేశం కొనియాడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఇన్చార్జి ప్రిన్సిపాల్ హనుమంత్ రెడ్డి, ఉపాధ్యాయులు జహీర్ ఖాన్, నూర్ మహమ్మద్, నరేంద్ర నాయక్, ఉష, శిరీష, గాయత్రి, ప్రత్యూష, నక్కా మహేష్ పాల్గొన్నారు.

వ్యాక్సిన్‌పై అపోహాలు వీడండి

పెద్దతిప్పసముద్రం: టీబీ నిరోధక టీకాలపై అపోహాలు వీడి, టీకా వేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను కందుకూరు పీహెచ్‌సీ డాక్టర్ శంకర్ వివరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పీహెచ్‌సీ సిబ్బంది ఇటీవల అన్ని గ్రామాల్లో ప్రజలకు టీకాలు వేసారన్నారు. అయితే టి.సదుం పంచాయతీ పరిధిలోని పలువురికి టీకాలు వేసుకోవడం వల్ల చేతికి టీకా వేసిన ప్రదేశంలో రంధ్రం ఏర్పడిందనే విషయం తమ దృష్టికి వచ్చిందని డాక్టర్ పేర్కొన్నారు. దీంతో శనివారం ఏఎన్ఎం, ఆశా వర్కర్లతో టి.సదుం పంచాయతీలో పర్యటించి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీకాలు వికటించి ఇలా జరిగిందని ప్రజల్లో ఉన్న అపోహాలకు స్వస్తి పలకాలని సూచించారు. అంతర్జాతీయ వైద్య సంస్థలు, డబ్ల్యూహెచ్‌వో, యునిసెఫ్ సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా బీసీజీ వ్యాక్సిన్ తయారు చేసిందన్నారు. టీకా వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయోత్సవ ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, విద్యార్థులు

రామసముద్రం: మండల కేంద్రంలో బీజేపీ యువ మోర్చ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు కార్గిల్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో భారత్ సైనికులు 527 మంది మరణం పొంది యుద్ధం గెలిచి 25 సంవత్సరాలు అయిందన్నారు. అనంతరం హైస్కూల్ విద్యార్థులచే దిగువపేట, బజారువీధి, ఎగువపేట వరకు ర్యాలీ చేశారు. వందేమాతరం అంటు విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి, మండల అధ్యక్షుడు ఇంజమ్ ఆనంద్‌నాయుడు, ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

శిలాఫలకాల ధ్వంసంపై ఫిర్యాదు


పోలీసులకు వినతి పత్రం అందజేస్తున్న కేవీ రమణ

పెద్దతిప్పసముద్రం: మండలంలో నెల రోజుల నుంచి టీడీపీ నాయకులు అభివృద్ధి పనుల శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కేవీ రమణ శనివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని పులికల్లు, కాట్నగల్లు, పోతుపేట, అముల్దార్లపల్లి తదితర గ్రామాల్లోని ప్రారంభోత్సవ శిలా ఫలకాలను, వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మెలను ధ్వంసం చేసారన్నారు. తాజాగా శుక్రవారం మండల కేంద్రంలోని సచివాలయం వద్ద ఉన్న శిలా ఫలకాన్ని ధ్వంసం చేయడానికి టీడీపీ నాయకులు విఫలయత్నం చేశారని ఆరోపించారు. అలాగే గత ప్రభుత్వంలోని శిలా ఫలకాలన్నీ తీసేయాలంటూ బహిరంగంగా మండల స్థాయి అధికారులపై బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. మండల స్థాయి టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే ఈ విధ్వంసాలు జరుగుతున్నాయని , ఈ ఘటనలపై సమగ్రంగా విచారణ జరిపి ఇందుకు కారకులలైన వారిపై చట్టరీత్యా చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేవీ రమణ ఫిర్యాదుకు మండల, గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు సంఘీభావం తెలిపారు.

కేంద్రం తెచ్చిన నూతన చట్టాలు దేశానికి ప్రమాదం

– ఐలు రాష్ట్ర కోశాధికారి ఎస్.రమేష్ బాబు


మాట్లాడుతున్న రమేష్‌బాబు

మదనపల్లె : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త క్రిమినల్ చట్టాలు ప్రమాదకరంగా ఉన్నాయని అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలు) రాష్ట్ర కోశాధికారి న్యాయవాది ఎస్.రమేష్ బాబు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన నూతన క్రిమినల్ చట్టాలపై ×ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్₹ (ఐలు), ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ఎన్‌జీఓ హోమ్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఐలు మదనపల్లి కమిటీ ఉపాధ్యక్షులు పివి.ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ దేశంలో వలస పాలకులు తీసుకొచ్చిన చట్టాలు కొనసాగకూడదంటూ, వాటి స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలను తీసుకువచ్చిందన్నారు. కొత్త నేర చట్టాల్లో గొప్పగా మార్పులు చేసిన దాఖలాలు లేవని తెలిపారు. పాత చట్టాలనే పేర్లు మార్చారని, నేడు తీసుకొచ్చిన నూతన నేర చట్టాల్లో కేవలం పది శాతం చట్టాలను మాత్రమే మార్పులు చేశారని వివరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాల్లో అటువంటి ఆనవాళ్లు కనిపించడం లేదని పేర్కొన్నారు. ప్రశ్నించే వారిని నోరెత్తకుండా కఠిన శిక్షలు విధించనున్నారని తెలిపారు. అధికారులకు, పోలీసు వ్యవస్థకు మరిన్ని అధికారాలు ఇచ్చేలా కొత్త నేర చట్టాలు ఉన్నాయని, వీటితో సామాన్య ప్రజలు హక్కులు కోల్పోతారని వివరించారు. కొత్త చట్టాలపై పౌర సమాజానికి, న్యాయవాదులకు లోతైన పరిశీలన అవసరమని చెప్పారు. బెయిల్ మంజూరులో మార్గదర్శకాలు, పోలీసు అధికారులను ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్లుగా పరిగణించడం, జ్యుడిషియరీ అధికారాలు నియంత్రించేలా నూతన చట్టాలు ఉన్నాయన్నారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా కోశాధికారి టీ.హరిశర్మ, మదనపల్లి బార్ అసోసియేషన్ కార్యదర్శి బయ్యారెడ్డి, ఐలు జిల్లా నాయకులు కె.సోమశేఖర్, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కన్వీనర్ యం.భాగ్యమ్మ ప్రసంగించారు.

వైభవంగా ఎల్లమ్మ జాతర ప్రారంభం


అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న రెడ్డివారి కుటుంబీకులు, ధర్మకర్త అశోక్‌కుమార్‌రెడ్డి

కలికిరి: కలికిరి గ్రామ దేవత ఎలమ్మ జాతర వైభవంగా ప్రారంభమైంది. శనివారం సాయంత్రం ఆలయ ధర్మకర్త రెడ్డివారి అశోక్‌కుమార్‌రెడ్డి దంపతులు, రెడ్డివారి వంశీకులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం రమణాచారి ఇంటి వద్ద నుంచి తెచ్చిన నగలతో అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. రాత్రి 9 గంటల నుంచి అమ్మవారి కథాకాలక్షేపం నిర్వహించారు. జాతర ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణం, పరిసరాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

నేడు దీలు, బోనాల సమర్పణ

ఎల్లమ్మ జాతర ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు ఆదివారం కలికిరి పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి దీలు, బోణాలు సమర్పించనున్నారు. అమ్మవారికి నగిరిండ్ల గ్రామస్తులు బోణాలు సమర్పించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ నిర్వాహకులు చర్యలు చేపట్టారు. ప్రత్యేక క్యూ ఏర్పాటు చేశారు. జాతరలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా తపాళా కార్యాలయం, మువ్వలవారి మిషన్ కాంపౌండ్ మీదుగా పాత సాయిబాబా ఆలయం వద్ద సోమల రహదారిలో కలిసేటట్లు పోలీసులు ట్రాఫిక్ మళ్లించారు. భక్తులు, వాహనదారులు సహకరించాలని ఆలయ నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మధుసూదన్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, యోగేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టమాటా పంటలో క్షేత్ర దినోత్సవం


టమాటా పొలంలో రైతులతో కలసి క్షేత్రదినోత్సవం నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలు

మదనపల్లె : కలికిరి కృషి విజ్ఞానకేంద్రం, ఐకార్ న్యూఢిల్లీ సహకారంతో మండలంలోని కాశీరావుపేటలోని రామయ్య టమాటా పొలంలో శనివారం క్షేత్రదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్.కే.మంజుల మాట్లాడుతూ.. టమోటా పంటలో అవసరం మేరకు మాత్రమే పురుగు, తెగుళ్ల మందులను వినియోగించి సమగ్ర విధానాలు పాటిస్తే అందులో అవశేషాలను తగ్గించవచ్చునన్నారు. రైతుల ఆరోగ్యమును కాపాడుకోవడమే కాకుండా భూసారాన్ని పెంపొందించవచ్చన్నారు. ఇతర జీవరాసులకు హాని తప్పించవచ్చునని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం కీటకవిభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్.రాఘవేంద్ర మాట్లాడుతూ. టమాటాలో మొదటనుంచి పాటించవలసిన సమగ్ర సస్యరక్షణ విధానాలను వివరించారు. టమాటా నారు పది మిల్లీలీటర్ల ట్రైకోడెర్మాను ఒక లీటర్ నీటిలో కలిపిన మిశ్రమంలో పాటు ఒక గంట పాటు ముంచి నాటడం, పంట చుట్టూ నాలుగు వరుసలు మొక్కజొన్న, జొన్న లేదా సజ్జ పంటలను వేయడం, 16 వరుసలకు రెండు వరుసలు ఎరపంటగా పసుపు రంగు పూల బంతి మొక్కలు నాటడం, పసుపు, నీలం జిగురు అట్టలు 5, 5 ఎకరాకి పంట చివరన 40 లేదా 60 వాట్స్ బల్బులను అమర్చడం ద్వారా పురుగుల ఉధృతిని తగ్గించవచ్చన్నారు. అలాగే వేప నూనె ఐదు మిల్లీమీటర్లు ఒక లీటరుకు 300 పీపీఎం పిచికారి చేస్తే వివిధ రకాల గొంగళి పురుగులు, రసం పీల్చే పురుగులు నుంచి పంటను కాపాడవచ్చునని చెప్పారు. తప్పని పరిస్థితులలో గ్రీన్ లేబుల్ పెస్టిసైడ్స్ అయిన స్పైనోసాడ్ మొదలగు వాటిని వాడుకోవాలన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను సాధించాలని కోరారు. తదుపరి రైతులందరికీ సమగ్ర సస్యరక్షణ ప్రయోగ టమాటా పంటలో ప్రత్యక్షంగా ఈ పద్ధతుల ఉపయోగాన్ని చూపించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీ నాగ ప్రసాద్ గారు, ఉద్యాన అధికారి ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి గారు, కె వి కె శాస్త్రవేత్తలు సిబ్బంది, ఆర్ఎస్‌కే సిబ్బంది, 70 మంది రైతులు పాల్గొన్నారు.

నారాయణస్వామి సేవలు మరువలేనివి


నారాయణస్వామిని సన్మానిస్తున్న అధికారులు

రామసముద్రం: రామసముద్రం ఎంపీడీఓగా పని చేస్తూ పదవి విరమణ పొందిన ఎల్.నారాయణ స్వామి సేవలు మరువలేనివని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ భానుప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులు పట్ల ఎంతో బాధ్యతా ఉండేవాడని కొనియాడారు. సి అనంతరం కార్యాలయ సిబ్బంది , పంచాయతీ కార్యదర్శులు , సచివాలయ సిబ్బంది ఆయన సేవలను గుర్తు చేస్తూ దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో హేమలత, ఏఈ వినోద్, ఎస్వీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి తల్లిపేరుతో ఒక మొక్క నాటాలి

– డీఈఓ శివప్రకాష్‌రెడ్డి


మొక్కలు నాటే కార్యక్రమంలో డీఈఓ శివప్రకాష్‌రెడ్డి

పీలేరు రూరల్ : సమాజంలో ప్రతి విద్యార్థి తన తల్లి పేరిట ఒక మొక్క నాటి దానిని సంరక్షించాలని డీఈఓ శివప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో పర్యావరణ దినోత్సవాన్ని పరస్కరించుకుని తల్లిపేరిట మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. వేగంగా అంతరించి పోతున్న అడవుల కారణంగా వాతావరణంలో అనూహ్య పరిణామాలు సంభవించి మానవ మనుగడకు ప్రతికూల పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. పెరిగిపోయిన వాహన కాలుష్యం కారణంగా ఆక్సిజన్ బదులు కార్బన్‌డైయాక్సిడ్ పీల్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. రోజు రోజుకు ఓజోన్ పొర పలచబడడం కారణంగా ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయని చెప్పారు. మొక్కల పెంపకం ఒక్కటే దీనికి పరిష్కారమార్గని తెలిపారు. సామాజిక బాధ్యతలో భాగంగా ప్రతి విద్యార్థి విడివిడిగా మొక్కలు నాటాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలో ఏకో క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గత ఏడాదిలో జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో 2.49 లక్షల మంది విద్యార్థులు ఉండగా, ఈ ఏడాది ఆ సంఖ్యను అధిగమిస్తున్నట్లు తెలిపారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో 20కి మించి విద్యార్థులుంటే మరో ఉపాధ్యాయున్ని నియమిస్తున్నామన్నారు. అడ్మిషన్లు పెంచుకోవడానికి ఆగష్టు వరకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి, ప్రధానోపాధ్యాయులు నటరాజ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి

కలికిరి: టమాటా పంట సాగులో రైతులు రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని కేవీకే కో-ఆర్డినేటర్ డా. మంజుల అన్నారు. కలికిరి కేవీకే పరిధిలోని వాల్మీకిపురం మండలం కాశీరావుపేట వద్ద రైతు రామయ్య పొలంలో శనివారం క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవసరమైన మేరకే పురుగు, తెగుళ్ళ మందులను వినియోగించి, సమగ్ర విధానాలు పాటిస్తే మందుల అవశేషాలు తగ్గించవచ్చన్నారు. ఐఈఏఆర్-ఎన్‌సీఐపీఎం కీటక విభాగ సీనియర్ శాస్త్రవేత్త డా. కేవీ రాఘవేంద్ర మాట్లాడుతూ టామాటా మొక్క నారు దశ నుంచి సస్యరక్షణ చర్యలు చేపట్టినట్లయితే నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చని రైతులకు వివరించారు. సస్యరక్షణ చర్యలు చేపట్టిన పంట దిగుబడిని మిగిలిన రైతులకు క్షేత్ర స్థాయిలో చూపించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ నాగప్రసాద్, ఉద్యానశాఖ అధికారి ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.